

## వాహనమిత్ర దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలి

### కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

వాహనమిత్ర పథకం కింద అందిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం ఈ నెల 20వ తేదీ శనివారంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఎంపిడిఒలను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం వాహనమిత్ర పథకం కింద అందిన దరఖాస్తులపై జిల్లా పరిషత్ సిఇఒ, ఎంపిడిఒలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, ఇ-కెవైసి ప్రక్రియ, దరఖాస్తుల పరిశీలనలను శనివారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. జిల్లాలో వాహనమిత్ర పథకానికి 8,429 దరఖాస్తులు అందాయని, వాటిలో 6,418 దరఖాస్తులు ఇ-కెవైసి పూర్తి అయ్యాయని, మిగిలిన దరఖాస్తుదారుల ఇ-కెవైసి పనులు శనివారంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు.

# గత ప్రభుత్వ అడుగుజాడల్లో కూటమి

### రణభేరి యాత్రలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ అడుగుజాడల్లోనే పాలన సాగిస్తోందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ చేపట్టిన రణభేరి యాత్ర శుక్రవారం ఉదయం 8 గంటలకు ఏలూరు జిల్లాలో ప్రవేశించింది. నాచుగుంట వద్ద యుటిఎఫ్ నాయకులు రణభేరి యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి జాతా నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చేరింది. అక్కడ ఎంఎల్‌సి గోపీమూర్తి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో పిఆర్‌సి అని చెప్పి రివర్స్ పిఆర్‌సి ఇచ్చారని విమర్శించారు. అప్పుల కోసం విద్యారంగాన్ని ప్రయివేటుపరం చేసేందుకు పాలకులు వ్యూహాలు రచిస్తున్నారని విమర్శించారు. నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పెరుగుతున్న బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని, పెండింగ్ డిఎలను విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, 12వ పిఆర్‌సి కమిషనర్‌ను నియమించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఈ నెల 25న గుంటూరులో జరిగే భారీ బహిరంగ సభ ద్వారా ప్రభుత్వానికి ఒక అల్టిమేటం ఇవ్వనున్నామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబసు, సుభాషిణి, చక్రవర్తి, శ్రీదేవి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, ఆర్.రవికుమార్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, కాకినాడ జిల్లా అధ్యక్షులు సూరిబాబు పాల్గొన్నారు.



చింతలపూడి : మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి


ద్వారకాతిరుమలలో..


జంగారెడ్డిగూడెంలో..

**ద్వారకాతిరుమల:** యుటిఎఫ్ రణభేరి బైక్ జాతా శుక్రవారం మండలం మీదుగా సాగింది. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నేతలతోపాటు జిల్లా కార్యదర్శి దేవానందరావు, సంబారు రాంబాబు, సిహెచ్.శ్రీధర్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.జయరాజు, కట్ట శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమలలో యుటిఎఫ్ భవనం వద్ద జరిగిన సమావేశంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, మూడు నెలలుగా పెండింగులో ఉన్న జీతభత్యాలు చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహాధ్యక్షులు పి.రాంబాబు, కె.చినబాబు, కార్యదర్శులు కాళి శ్రీనివాసరావు, అప్పయ్య బాల, సురేష్, రవితేజ, సారథి బెన్నీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం:** యుటిఎఫ్ రణభేరి యాత్ర శుక్రవారం మధ్యాహ్నం జంగారెడ్డిగూడెం చేరుకుంది. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు శ్యాంబాబు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు రణభేరి యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం జంగారెడ్డిగూడెంలోని యుటిఎఫ్ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులపై ఉన్న ఒత్తిడి కంటే ఇప్పుడు ఇంకా ఎక్కువగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కనికరం చూపి, వారి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు రవిచంద్ర, బి.సుభాషిణి, శ్రీదేవి, జ్యోతిబసు, జిల్లా నేతలు పాల్గొన్నారు.

**చింతలపూడి** : గత ప్రభుత్వ అడుగుజాడల్లోనే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ చేపట్టిన రణభేరి యాత్ర శుక్రవారం చింతలపూడి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రవీణ్ ప్రకాష్ ముసుగులో ఉపాధ్యాయులను అంతర్జాల కబంధ హస్తాల్లో పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. గత ప్రభుత్వం ఐదు డిఎలు పెండింగ్‌లో పెట్టిందన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలపై దెబ్బ కొట్టిందని చెప్పి ఎన్నికల్లో కూటమికి ఓట్లు, ఉపాధ్యాయులు ఏకపక్షంగా ఓట్లు వేశారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిఆర్‌సి కమిషన్ నియమిస్తామని, పెండింగ్ డిఎలు వేల కోట్ల బకాయిలు చెల్లిస్తామని, ఉపాధ్యాయులకు మరింత గౌరవం పెంచుతామని చెప్పి మోసగించారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, డిఎలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు పూరేటి శ్రీనివాసరావు, అప్పారావు, దామోదర్, ప్రేమ్‌కుమార్, బుచ్చిబాబు, చక్రధరావు, చాల్లెస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## యుటిఎఫ్ ఆందోళనకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ చేస్తున్న ఆందోళనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రణభేరి బైక్ జాతా శుక్రవారం ఏలూరు యుటిఎఫ్ కార్యాలయం వద్ద ముగిసింది. శుక్రవారం ఉదయం ఉంగుటూరు వద్ద జిల్లాలో ప్రవేశించిన జాతా నారాయణపురం, భీమడోలు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం, చింతలపూడి మీదుగా ఏలూరు చేరుకుని ఏలూరు యుటిఎఫ్ కార్యాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌సి మాట్లాడుతూ 15వ తేదీనుంచి ప్రారంభమైన జాతాలో అనేక మంది ఉపాధ్యాయులు తమ సమస్యలు చెప్పుకున్నారని, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బోధనకే పరిమితం కావాలని డిమాండ్ ముఖ్యంగా వినిపించిందని తెలిపారు. గతంలో విద్యార్థులకు పాఠాలు బోధించడమే ఉపాధ్యాయుల ముఖ్యమైన విధిగా ఉండేదని, కాలక్రమంలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇతర ప్రయోజనాల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు తెచ్చి, వాటిని అమలు చేసేందుకు సిబ్బందిని నియమించకుండా ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దుతూ ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బడుగు బలహీన వర్గాలకు చదువు అందని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పథకాలు కార్యక్రమాలు అమలు చేయడం, వాటిని ఫొటోలు తీయడం, అప్లోడ్ చేయడం మాత్రమే గాక ఉన్నత అధికారులు అప్పటికప్పుడు వచ్చే ఆదేశాల మేరకు వాటిని ఆన్‌లైన్‌లో పంపించడంతోనే ఉపాధ్యాయుల సమయం గడిచిపోతున్నదన్నారు. మరోవైపు కార్పొరేట్ విద్యా శక్తి వంటి పథకాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగుల ఉపాధ్యాయుల ఆర్థిక మూలాల మీద దెబ్బకొట్టిన నేపథ్యంలో ఆ ప్రభుత్వం నుంచి విముక్తి కోసం ఉద్యోగ ఉపాధ్యాయులంతా గత ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి తమ మద్దతు తెలియజేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిందని, తమ ప్రభుత్వం వచ్చాక మెరుగైన పిఆర్‌సి ఇవ్వడంతో పాటు ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని, ఈ లోపు మధ్యంతర భృతి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. యుటిఎఫ్ చేస్తున్న పోరాటానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిగా తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎన్.అరుణకుమారి, బి.సుభాషిణి మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించడంతోపాటు ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించి బోధనేతర పనులు నిర్వహించడానికి నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఈనెల 25వ తేదీన గుంటూరులో జరుగుతున్న భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రవికుమార్ రుద్రాక్షి, నాయకులు చక్రవర్తి, జ్యోతిబసు, శ్రీదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

# 'మెడికల్' రాజకీయం..!

- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైసిపి, కూటమి పార్టీలు
- మెడికల్ కాలేజీల నిర్మాణంపై పోటాపోటీగా ధర్నాలు
- జగన్ హయాంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం అమల్లోకి
- 43 శాతం సీట్లకు రూ.12 లక్షలు, రూ.20 లక్షల ఫీజులు
- ఏలూరు మెడికల్ కాలేజీనే అందుకు ప్రత్యక్ష నిదర్శనం
- మెడికల్ కాలేజీల్లో పిపిపి విధానానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధం
- వైసిపి, కూటమి తెచ్చిన రెండు విధానాలు తీవ్ర నష్టమే.. అయినా బుకాయింపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణంపై కూటమి, వైసిపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వం, ఇప్పుడు కూటమి సర్కార్ తెచ్చిన రెండు విధానాలూ ప్రజలకు ఏమాత్రం ప్రయోజనకరం కాదు. అయినప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా తాము చేసిందే గొప్ప అంటూ రెండు పార్టీల నేతలు పోటాపోటీగా ధర్నాలు నిర్వహించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వైసిపి హయాంలో నిర్మించిన ఏలూరు మెడికల్ కాలేజీ వేదికగా ఈ రెండు పార్టీల నేతలు చేస్తున్న హడావుడి చూసి అంతా విస్తుపోతున్నారు. సామాన్యుల పిల్లలు మెరిట్‌లో ఎంబిబిఎస్ సీటు సాధించినప్పటికీ ఫీజులు కట్టే విధానం ఏవిధంగా మంచిదవుతుందో వైసిపి, కూటమి నేతలు చెప్పాల్సి ఉంది. మెడికల్ కాలేజీలపై వైసిపి తెచ్చిన విధానం, కూటమి ప్రభుత్వం అవలంభించబోతున్న తీరు ఒకసారి పరిశీలిస్తే అసలు విషయం తేటతెల్లమవుతోంది. వైసిపి, కూటమి పార్టీలు వైద్యవిద్యను ఏవిధంగా నాశనం చేసేందుకు తెగబడ్డాయో అర్థమవుతోంది.



వైద్య కళాశాలను చూపుతున్న ఎంఎల్‌ఎ, నేతలు


ఆందోళన చేస్తున్న వైసిపి నేతలు

### వైసిపి తెచ్చిన విధానంతో 42 శాతం సీట్లకు ఫీజు వసూలు

2019-24 మధ్య వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మించింది. వీటిలో ఏలూరు మెడికల్ కాలేజీ ఒకటి. ఈ కాలేజీకి 150 సీట్లు కేటాయించారు. గతంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా 15 శాతం, స్టేట్ కోటా కింద 85 శాతం సీట్లను భర్తీ చేసేవారు. నామమాత్రపు ఫీజు రూ.15 వేలు మాత్రమే వసూలు జరిగేది. వైసిపి ప్రభుత్వం తెచ్చిన విధానంలో ఆలిండియా కోటా 15 శాతం, స్టేట్‌కోటా కింద 42 శాతం సీట్లు మొత్తం 57 శాతం ఎంబిబిఎస్ సీట్లను మాత్రమే నామమాత్రపు ఫీజు రూ.15 వేలతో భర్తీ చేశారు. మిగిలిన 43 శాతం సీట్లను అంటే 150 సీట్లలో 64 సీట్లను బి, సి కేటగిరి కింద రూ.12 లక్షలు, రూ.20 లక్షలు ఫీజు వసూలు పెట్టింది. ఏలూరు మెడికల్ కాలేజీలో ఇదే విధంగా ఫీజుల వసూలు జరుగుతోంది. మెరిట్‌లో సీటు సాధించిన విద్యార్థులు సైతం ఏడాదికి దాదాపు రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సామాన్య కుటుంబాల పిల్లలు ఎంబిబిఎస్ సీటు సాధించినా ఇంత పెద్దమొత్తంలో ఫీజు చెల్లించలేక వైద్యవిద్యకు దూరమవుతున్నారు. వైసిపి తెచ్చిన విధానం అప్పట్లో పెద్దదుమారమే రేపింది. అయినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగింది. తాము అధికారంలోకి వస్తే మెడికల్ కాలేజీల్లో వైసిపి ప్రభుత్వం తెచ్చిన ఫీజు వసూలు విధానాన్ని రద్దు చేస్తామని లోకేష్, చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పిపిపి విధానం తెచ్చి సామాన్యుల పిల్లలకు పూర్తిగా వైద్యవిద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో ఫీజు వసూలుకు తెరలేపిన వైసిపి ఇప్పుడు తాము అంతా మంచి చేసినట్లు ఆందోళన చేస్తుండటం విడ్డూరంగా ఉంది.

### పిపిపి విధానంలో 85 శాతం సీట్లకు ఫీజు వసూలు

చంద్రబాబు సర్కార్ 12 మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో చేపట్టేందుకు సిద్ధమైంది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజాసంఘాలు, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన నెలకొంది. దీంతో పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. గుజరాత్‌లో పిపిపి విధానంలో మెడికల్ కాలేజీలు ఇప్పటికే నడుస్తున్నాయి. ఈ విధానంలో ప్రయివేటు వ్యక్తులకు ప్రభుత్వ భూములతోపాటు నిర్వహణా అనుమతులు ఇచ్చేసింది. కాలేజీల నిర్వహణ అంతా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోనే ఉంది. ఒక కాలేజీలో 150 సీట్లు ఉంటే వాటిలో 15 శాతం ఆలిండియా కోటా కింద నామమాత్రపు ఫీజుతో సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 85 శాతం సీట్లకు సగటు ఫీజు రూ.నాలుగు లక్షలు, బి కేటగిరిలో సీట్లకు రూ.13 లక్షలు, సి కేటగిరి సీట్లకు రూ.25 లక్షలు చొప్పున గుజరాత్ పిపిపి మోడల్ మెడికల్ కాలేజీల్లో వసూలు చేస్తున్నారు. ఇక్కడ కూడా అదేవిధానం అమలు చేసే పరిస్థితి రానుంది. మెరిట్ విద్యార్థులకు రూ.15 వేల ఫీజుతో రావాల్సిన సీట్లకు రూ.లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్న మాట. కూటమి ప్రభుత్వం తెస్తున్న పిపిపి విధానం వైసిపి ప్రభుత్వం తెచ్చిన విధానం కంటే అత్యంత దారుణంగా ఉండనుంది. ఈ రెండుపార్టీలు ఇప్పుడు మెడికల్ కాలేజీ సీట్లపై తమ విధానాలు గొప్పగా చెప్పడం విడ్డూరంగా ఉంది. ఏలూరులో వైసిపి, కూటమి నేతలు మెడికల్ కాలేజీలపై చేస్తున్న ధర్నాలు చూసి అంతా నవ్వుతున్న పరిస్థితి నెలకొంది.

## 'చలో మెడికల్ కాలేజీ' అడ్డగింత

### టిడిపి, వైసిపి నేతల మధ్య ఉద్రిక్త వాతావరణం
### సముదాయించిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ చేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు, విద్యార్థులు నష్టపోతారని వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడంపై వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం చేపట్టారు. వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుప్పాల వాసుబాబు, పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం బాలరాజు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు యువత, విద్యార్థులతో కలిసి చలో మెడికల్ మెడికల్ కాలేజీ కార్యక్రమంలో భాగంగా నిరసన తెలిపేందుకు వెళుండగా టిడిపి నాయకులు, కార్యకర్తలు వారిని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు వైసిపి వారిని మెడికల్ కళాశాలకు వెళ్లకుండా అడ్డగించారు. దీంతో వారు సిఎస్‌ఐ చర్చి వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఇరు పార్టీల నేతలను పోలీసులు సముదాయించి వెనక్కి పంపించారు. అనంతరం నిర్వహించిన పత్రికా సమావేశంలో దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేసేందుకు సిద్ధమైందని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని పిపిపి విధానం తీసుకొచ్చిందని, ప్రయివేటీకరణతో పేద, మధ్య తరగతి ప్రజలు, విద్యార్థులు నష్టపోతారని చెప్పారు.

## సమస్యలు పరిష్కరించాలని దస్తావేజు లేఖర్ల నిరసన

### రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా రెండు రోజులు దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏలూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు ఏలూరు దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పివి.సుబ్బారావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసినప్పుడు కక్షిదారుల పేర్ల నమోదుకు పబ్లిక్ డేటా ఎంట్రీ చేసే సమయంలో ఓటిపి అడుగుతుందని, దానివల్ల కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే గతంలో కక్షిదారులు అనారోగ్యానికి గురైనప్పుడు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు రాలేకపోయిన సందర్భాల్లో సబ్ రిజిస్ట్రార్ కక్షిదారుల ఇంటికి వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేవారని, దాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసి కక్షిదారులకు, దస్తావేజు లేఖర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సముద్రాల నాగరాజు, ఏలూరు అధ్యక్షులు సముద్రాల దుర్గారావు, గారపాటి వీరస్వామి, పాపారావు, శివకుమార్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు

**భీమడోలు** : రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా కార్డు 2.0 విధానం ద్వారా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, దస్తావేజుల లేఖర్ల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లాల ఆర్గనైజింగ్ కార్యదర్శి నండూరి శ్రీరామ్ కోరారు. భీమడోలు కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దస్తావేజు లేఖరుల సంఘం శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టింది. రెండు రోజులపాటు కొనసాగే కార్యక్రమంలో శుక్రవారం సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమానికి దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం భీమడోలు శాఖ ప్రతినిధులు వెజ్జు నాగేశ్వరరావు, వర్ధినీడి బాలమురళీ కృష్ణ, ఎస్.రాము నాయకత్వం వహించారు.

**నూజివీడు టౌన్** : రిజిస్ట్రేషన్ శాఖలో ఓటిపి నూతన విధానానికి చరమగీతం పాడి, దస్తావేజు లేఖర్లకు లైసెన్సులు మంజూరు చేయాలని దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షులు ఆలీ అబ్బాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖర్ల యూనియన్ ఆధ్వర్యంలో పెన్‌డౌన్‌లో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అలీ అబ్బాస్ మాట్లాడారు. రిజిస్ట్రేషన్ విధానాల్లో ఓటిపి నూతన పద్ధతిని రద్దు చేయాలన్నారు.

## నిలకడగా గోదావరి వరద

### ముంపులోనే గుండేటి వాగు కాజ్ వే

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వారం రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వస్తున్న గోదావరి వరద శుక్రవారం నిలకడగా ఉంది. భద్రాచలంలో గురువారం 38 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం శుక్రవారం నాటికి 36 అడుగులకు చేరుకుని స్వల్పంగా తగ్గింది. భద్రాచలంలో గోదావరి వరద తగ్గినా మండలంలో నిలకడగా ఉంది. ఇప్పటికే గత వారం రోజులుగా దాచారం-కుక్కునూరు మధ్య గుండేటి వాగు కాజ్ వే ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. గోదావరి వరద పెరుగుతూ తగ్గుతూ దోబుచులాడుతుండడంతో మండలంలోని మిర్చి సాగు చేసే రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

**పెరిగిన గోదావరి నీటిమట్టం**

**పోలవరం** : అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడిన గోదావరి శుక్రవారం సాయంత్రానికి మళ్లీ పెరిగింది. ప్రాజెక్టు స్పిల్ వే నుంచి 6,93,063 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖాధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 31.170 మీటర్లు, స్పిల్ వే దిగువన 22.190 మీటర్లు నమోదైంది.

## రెండో రోజూ విఆర్‌ఎల ధర్నా

**ముదినేపల్లి** : విఆర్‌ఎలకు పే స్కేలు అమలు చేసి నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, ప్రధాన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ రెండోరోజు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విఆర్‌ఎల సంఘం అధ్యక్షులు వై.రాజేష్ మాట్లాడుతూ అర్హులైనవారిని విఆర్‌ఒలుగా, నైట్ వాచ్‌మెన్‌గా, అటెండర్లుగా, డ్రైవర్లుగా ప్రభుత్వం తీసుకోవాలన్నారు. రాష్ట్ర గ్రామ రెవెన్యూ సేవకుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 20న ఏలూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ ధర్నాలో విఆర్‌ఎలు బలరామ్, వసంతరావు, రాజేష్, సురేష్, ప్రసాద్, నూర్జహాన్, శివపార్వతి, భవాని, గంగాధరరావు, అన్నామణి, సునీత, సాయి, ముసలయ్య, కోటేశ్వరరావు, సుమతి, చంద్రకాంత్, హుస్సేన్ పాల్గొన్నారు.

## 'వాహనమిత్ర'కు దరఖాస్తు గడువు పెంచాలి

### రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలి
### కలెక్టర్‌కు జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వాహన మిత్ర పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించాలని, లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చక్రాల అమర్‌కుమార్, జె.గోపీ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెట్రిసెల్వికి యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అమర్, గోపీ మాట్లాడుతూ స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం వల్ల జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు తమ ఆదాయంలో 60 శాతానికి పైగా నష్టపోతున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సిఐటియు స్వాగతిస్తుందన్నారు. అదే సమయంలో ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయాన్ని రూ.15 వేల నుంచి రూ.30 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. రవాణా రంగ కార్మికులలో అత్యంత దారుణమైన పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకునే విధంగా సాధికారిక బోర్డును ఏర్పాటు చేయాలని, అధిక పెనాల్టీలను విధించే విధంగా రూపొందించిన జిఒ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందిస్తూ వినతి పత్రం ద్వారా తెలియజేసిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సిఐటియు నాయకులు బి.చంద్రశేఖర్, ఎం.ఇస్సాకు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

## మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి సాయికిరణ్

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

మినీ సెంటర్లన్నింటినీ మెయిన్ సెంటర్లుగా మార్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. కుక్కునూరు ప్రాజెక్టు సిడిపిఒకు మినీ వర్కర్ల సమస్యలుపై సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ మినీ వర్కర్లు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ తల్లి బిడ్డ సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ పేదలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తూ నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీలు చాలీచాలని జీతాలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరుతూ ఆందోళన చేపట్టిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల చేసిందన్నారు. పదో తరగతి క్వాలిఫికేషన్ లేని వారికి క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇవ్వాలని కోరారు. కుక్కునూరు మండలంలోని కిష్టారం సెక్టార్‌లోని లచ్చిపేట, గుండుగూడెం, కుక్కునూరు సెక్టార్‌లోని కౌండిన్యముక్తి, కొత్తూరు మినీ అంగన్వాడీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అంగన్వాడీలు బాడిస సుజాత, వర్స మంగ, కారం వందన, పున్నమ్మ, భవాని, దుర్గ, రజిని, వెంకటరమణ, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నేతలు

## కలెక్టర్‌చే ఇవిఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక జిల్లా కలెక్టరేటు ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్‌ను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి శుక్రవారం తనిఖీ చేశారు. ఇవిఎం గోడౌన్ వద్ద సీసీ కెమెరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం యంత్రాలు, బియులు, సియులు, వివిప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఇవిఎం గోడౌన్‌కు వేసిన భద్రతా సీళ్లు, సీసీ కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు గోడౌన్ క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఇవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలి

### న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోరారు. ఈ మేరకు వారు మంత్రి కొలుసు పార్థసారధి కార్యాలయం వద్ద నిరసన తెలియజేసేందుకు, మంత్రికి వినతిపత్రం అందించేందుకు కార్యాలయానికి బయలుదేరారు. కోర్టు ప్రాంగణం నుంచి పట్టణ పురవీధుల మీదుగా బస్టాండ్ వద్దకు చేరుకునేసరికి వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో న్యాయవాదులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మంత్రి కార్యాలయంలో వినతిపత్రం ఇస్తామని పోలీసులకు చెప్పినా వారు అనుమతి ఇవ్వకపోవడంతో పోలీసులకు, న్యాయవాదులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం న్యాయవాదులు చిన గాంధీ బొమ్మ సెంటర్ వద్దకు చేరుకుని అక్కడ నిరసన తెలిపారు. పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాదులు మాట్లాడుతూ నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని సిఎం, మంత్రి హామీ ఇచ్చి అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలిపే వరకు నిద్రపోయేది లేదని చెప్పారు. ఉద్యమాన్ని ప్రజలతో కలిసి ఉధృతం చేస్తామని తెలిపారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

## కారాగారం సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కారాగారాన్ని శుక్రవారం పర్యవేక్షించారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగు నీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు, తదితర విషయాలను నిందితులను అడిగి తెలుసుకున్నారు. నిందితులకు అందించిన ఉచిత న్యాయ సలహాలు, సహాయంపై ఆరా తీశారు. అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం వంటశాల, స్టోర్ రూములను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగారా పర్యవేక్షణాధికారి కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ జి.విజయరావు, పిఎల్‌విబి.నాగార్జునసాగర్ పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

### రైతు సంఘం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతుల వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు కావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. కైకరంలోని తూర్పు వీధి ఎల్‌ఐసి కళ్యాణమండపంలో రైతు సంఘం మండల మహాసభ ఆ సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు వల్ల వ్యవసాయం సంక్షోభంలో ఉందని, రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్పొరేటీకరణ విధానాలు రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాయితీని తగ్గించుకునేందుకు యూరియా కొరత సృష్టించడం తగదన్నారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి ఉత్పత్తి ఖర్చులు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ క్వింటాల్ ధాన్యానికి రూ.మూడు వేలకు పైగా మద్దతు ధర కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, సిఐటియు మండల కన్వీనర్ చీర అప్పారావు మాట్లాడారు.


అభివాదం చేస్తున్న నేతలు

**రైతు సంఘం మండల నూతన కమిటీ**

రైతు సంఘం మండలాధ్యక్షులుగా తమ్మినీడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా దాసరి సతీష్, ఉపాధ్యక్షులుగా గుత్తికొండ వెంకటకృష్ణారావు, మండల సహాయ కార్యదర్శిగా వానపల్లి సత్యనారాయణ మరో ఏడుగురితో నూతన కమిటీ ఎన్నికైంది.

## మేలు రకపు వంగడాలతో అధిక దిగుబడి

### సిటిఆర్ఐ హెడ్ సుబ్బయ్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉత్తర ప్రాంత తేలిక నేలల్లో వర్జీనియా పొగాకు సాగులో మేలు రకపు వంగడాలతో అధిక దిగుబడి వస్తుందని జీలుగుమిల్లి సిటిఆర్ఐ హెడ్ డాక్టర్ వైవి.సుబ్బయ్య తెలిపారు. స్థానిక సిటిఆర్ఐ ఆవరణలో పొగాకు రైతులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర ప్రాంత తేలిక నేలల్లో సాగుకు సంబంధించి మేలు రకపు వంగడాలతో అధిక దిగుబడులు వస్తాయని సూచించారు. సిటిఆర్ఐలో పరిశోధన చేసి ప్రవేశపెట్టిన ఎఫ్‌సిజె-11 పొగాకు సాగులో అధిక దిగుబడి కోసం పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం పొగాకు సాగు చేసే ఎస్‌సి, ఎస్‌టి రైతులకు ఎఫ్‌సిజె -11 పొగాకు విత్తనాలతో పాటు ప్రో ట్రేలను ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫామ్ మేనేజర్ టి.రమేష్, సిబ్బంది ఎ.ప్రభు, శ్రీనివాస్, అన్నపూర్ణ, దుర్గారావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

### భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని..

ప్రజాశక్తి - టి.నరసాపురం

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన భర్త ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మక్కినవారిగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటపై ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన తెల్లమేకల సత్యనారాయణ(37)కు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో మద్యానికి బానిసైన సత్యనారాయణ రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో భార్య పలుమార్లు పుట్టింటికి వెళ్లిపోయిందని, దీంతో అతడు గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రెండు రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతడు మద్యం తాగి తిరుగుతూ అదే క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు గమనించి అతడిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తల్లి తెల్లమేకల వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## నిరుపేదలకు అండగా సిఎం సహాయ నిధి

### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేదల నాణ్యమైన వైద్యం కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లు కేటాయించిందని, నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ముసునూరు మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన కుటుంబానికి రూ.50వేల ఎల్ఓసి పత్రాన్ని మంత్రి అందించారు. నూజివీడు పట్టణానికి చెందిన శ్రీహరీష కుటుంబానికి రూ.60 వేల ఎల్ఓసి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో వైద్యం చేయించుకున్న వారు బిల్లులను తమ కార్యాలయంలో అందిస్తే సిఎం సహాయ నిధి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని, ప్రజలంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ఆశావర్కర్ల జిల్లా ఐదో మహాసభ

ప్రజాశక్తి - భీమడోలు

ఆశా వర్కర్ల జిల్లా ఐదో మహాసభ ఈ నెల 20వ తేదీ శనివారం భీమడోలులోని శ్రీ రొట్టెల ముసలయ్య కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కమల, కె.పోచమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆశావర్కర్స్ స్కీమ్ ఏర్పడి 20 ఏళు అయిందని, సుమారు పదేళ్ల పాటు ఉచితంగానే సేవలందించారని, కరోనా టైములో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించాలని తెలిపారు. గత పదేళ్ల నుంచి ఆశ యూనియన్ తరఫున ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశామని, దీంతో పారితోషకాల స్థానంలో ఫిక్స్‌డ్ వేతనం సాధించుకున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం రానున్న కాలంలో ఉద్యమాలు, పోరాటాలు చేయడానికి ఈ మహాసభ తోడ్పడుతుందని తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా ఆశ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

## ఎస్‌సి ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాని సక్రమంగా అమలు చేయాలి

### కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎస్‌సి ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, కౌంటర్ కేసులు కట్టడం ఆపాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాల్యాద్రి మాట్లాడారు. దళితులపై జరిగిన దాడుల ఘటన కేసుల్లో చట్టాన్ని నిర్వీర్యం చేసే రాజకీయ జోక్యం ఆపాలని, స్టేషన్ బెయిల్ ఇచ్చే 41 నోటీసులు విధానాన్ని ఆపాలని కోరారు. ఈ మేరకు సెప్టెంబర్ 25న విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరిగే భారీ బహిరంగ సభకు ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో న్యాయం జరగని బాధితులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు, కెవిపిఎస్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎరువులు అధికంగా వాడితే నష్టమే

ప్రజాశక్తి - భీమడోలు

రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడితే పైరుకు మేలు కన్నా కీడు ఎక్కువగా జరుగుతుందని, ఆర్థికంగా భారంగా మారుతుందని భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి అన్నారు. పూళ్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భీమడోలు వ్యవసాయాధికారితో రైతులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తగు పరిష్కారాలను సూచించారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరి సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు అవలంభించాలని సూచించారు. ఎరువుల్లో ఉన్న నత్రజని, భాస్వరం పొటాష్ తమ పరంగా పైరుకు చేసే ప్రయోజనాల గురించి వివరించారు. మండలంలో ఎరువుల కరువు లేదని, రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిలవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

### ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో చర్చించి వాటి పరిష్కారం కోసం మార్గం చూపాలని నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చి అనంతరం చలో సిఎం కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నూజివీడు నాయకులు సాయి ప్రసాద్, గోపీ, సంతోష్, గణేష్, విష్ణు, చరణ్, శివశంకర్, రవి, హర్షవర్ధన్, జస్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పామాయిల్ పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమ విద్యార్థులు విద్యతో పాటు పరిశ్రమలపై కూడా సమగ్ర అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో తమ విద్యాసంస్థ ప్రతిరోజూ కొత్త అవకాశాలను అందించేందుకు కృషి చేస్తుందని తపస్ హై స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, డైరెక్టర్ బుద్దాల సురేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా తపస్ హైస్కూల్ నుంచి 200 మంది విద్యార్థులు, అధ్యాపక బృందం కలిసి జంగారెడ్డిగూడెం సమీపంలో ఉన్న ప్రముఖ పామాయిల్ పరిశ్రమ నవభారత్ లిమిటెడ్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఈ పరిశ్రమ సందర్శన విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. విద్యార్థులకు పరిశ్రమలో జరిగే పూర్తి ఉత్పత్తి ప్రాసెస్ గురించి సేఫ్టీ ఇన్‌ఛార్జి రాజు అత్యంత విపులంగా, సహృదయంగా వివరించారన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో త్వరలో వెయిటింగ్ హాల్స్ నిర్మాణం

### జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

త్వరలో ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వారి బంధువుల కోసం వెయిటింగ్ హాల్స్ నిర్మించనున్నట్లు ఘంటా జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్విని జెడ్‌పి ఛైర్‌పర్సన్ శుక్రవారం కలిసి పలు అంశాలపై చర్చించారు. ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన సమస్యలు విశ్లేషించినప్పుడు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, గ్రామీణ జల సరఫరా, పారిశుధ్య శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఎక్కువ సమస్యలు ఉన్నట్లు గుర్తించామని జెడ్‌పి ఛైర్‌పర్సన్ కలెక్టర్‌కు వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ చురుకుగా స్పందిస్తుందని కలెక్టర్ హామీ ఇచినట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వారి బంధువులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెయిటింగ్ హాల్స్ నిర్మాణానికి సంబంధించి చర్చ జరిగిందని, స్థానిక ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య సహకారంతో త్వరలోనే ఈ నిర్మాణాలు చేపట్టి రోగులకు మరింత సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. అదేవిధంగా గత కొన్ని నెలలుగా జీతభత్యాలు అందక ఇబ్బందులు పడుతున్న సత్యసాయి తాగునీటి పథకం సిబ్బందికి సొమ్ము ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసినట్లు ఛైర్ పర్సన్ తెలిపారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్

## ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలి

### వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎర్రకాలువ మిగులు భూముల్లో సాగు చేస్తున్న పేదలందరికీ ఏక్ సాల్ పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆరో మహాసభ మండలంలోని సాలిగూడెం గ్రామంలో శుక్రవారం గుడెల్లి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఎర్రకాలవ ఇరిగేషన్ భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలందరికీ ఏక్ సాల్ పట్టాలిచ్చి సాగు హక్కు కల్పించాలని కోరారు. పేదల సాగులో ఉన్న భూములు పేదలకు దక్కకుండా కూటమి ప్రభుత్వ నాయకులు ఇరిగేషన్ వారిపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందికి గురి చేస్తున్నారని విమర్శించారు. మరో పక్కన పోలీస్ కేసులు కూడా పెడుతున్నారని వాపోయారు. మండలంలోని తిరుమలదేవిపేట పంచాయతీలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఉన్న ప్రభుత్వ భూముల్లో ఆయా గ్రామాల దళితులు, గిరిజన పేదలు సాగులో ఉన్న భూములకు, పంటలను ధ్వంసం చేసి ఇబ్బంది కల్గించేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న పేదలకు పంటలకు రక్షణ కల్పించాలని కోరారు. ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు దక్కేంతవరకు పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు మడకం సుధారాణి, ఐద్వా మహిళా సంఘం నాయకులు మడకం కుమారి, బొడ్డపాటి రాజు, కలపాల రాజు, బొద్దుల గంగాభవాని, కాకి సిరమయ్య, సరియం దుర్గమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు రెండు రోజుల రిలే నిరాహార దీక్ష శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐదు జిల్లాల డిస్కం జెఎసి కన్వీనర్ భూక్య నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో ఉన్న 25 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 26 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు అనేక ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారని, వారి న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు విద్యుత్ యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. ఉద్యమం మొదలుపెట్టి ఐదు రోజులు గడిచినప్పటికీ యాజమాన్యాలు ముందుకు రాకపోవడం దారుణమన్నారు. 1999 ఫిబ్రవరి ఒకటో తేదీ తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులకు పాత సర్వీస్ కండిషన్స్ అమలు చేయాలని, వారికి ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా జెఎసి ఛైర్మన్ ఎం.రమేష్ మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల ఒదరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. జిల్లా కన్వీనర్ వి.రాము మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన జరిగే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. డిస్కం కో-కన్వీనర్ తురగా రామకృష్ణ, నాయకులు సంజీవ్, గంగాధర్, తారా సింగ్‌నాయక్ తదితరులు మాట్లాడారు. ఈ నిరాహార దీక్షలో 50 మంది ఉద్యోగులు, 16 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో ఉద్యోగులు

## ఎపి ఎన్‌జిఒ సంఘాన్ని మరింత ఇనుమడింపజేయాలి

### ఎపి ఎన్‌జిఒ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జెడ్‌పి ఆవరణలో ఉన్న పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం ఏలూరు తాలూకా ఎపి ఎన్‌జిఒ సంఘం కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్ రాజు, కార్యదర్శి కప్పల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి ఎన్‌జిఒ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం 70 ఏళ్ల నుంచి సేవలను అందిస్తున్న సంఘంగా ఎపి ఎన్‌జిఒ సంఘాన్ని అభివర్ధిస్తూ అనేక ఉద్యమాలతో ఉద్యోగుల పక్షాన పోరాడుతూ ఉన్న సంఘాన్ని మరింత ఇనుమడింపజేయాలని, సభ్యత్వ నమోదు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. త్వరలోనే ఏలూరు తాలుకా యూనిట్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యోగులకు గత ఐదు సంవత్సరాలుగా అనేక సమస్యలు పేరుకుపోయాయని, ముఖ్యంగా సరెండర్ లీవుకు సంబంధించిన నగదు బకాయి, నాలుగు కరువు భత్యాలు చెల్లించాలని, 12వ పే రివిజన్ కమిటీ ఏర్పాటు చేసి కమిటీ రిపోర్టు వచ్చే లోపు మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలని కోరారు. అలాగే హెల్త్ కార్డ్స్ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీని వల్ల ఉద్యోగులు, పెన్షనర్స్ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు మాట్లాడుతూ ఇప్పటికే పోలవరం, కొయ్యలగూడెం యూనిట్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించామని, అన్ని యూనిట్స్‌కు త్వరలోనే ఎన్నికలు జరిపి జిల్లా ఎన్నికలను నవంబర్‌లోగా పూర్తి చేస్తామని తెలిపారు. పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యనారాయణ

**ద్వారకాతిరుమల :** రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన టిడిపి మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణకు మండల యాదవ సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా యాదవ సంఘం నాయకులు కంపసాటి రామకృష్ణ, ద్వారకాతిరుమల మండల యాదవ సంఘం అధ్యక్షులు సాయిల రమేష్, సభ్యులు పాకనాటి శ్రీమన్నారాయణ, బుసనబోయిన చంటి, చింతా రాంబాబు, నీలపాల సత్యనారాయణ, పాకనాటి దుర్గారావు, పాకనాటి ముక్క స్వామి, మండల యాదవ సంఘం సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా తాపీ ధర్మారావు జయంతి వేడుక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తెలుగు రచయిత, తెలుగు భాషా పండితులు, హేతువాది, నాస్తికుడు అయిన కీర్తిశేషులు తాపీ ధర్మారావు నాయుడు (తాతాజీ) 138వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తాపీ ధర్మారావునాయుడు చిత్రపటానికి డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 19వ తేదీన రాష్ట్రమంతా ఆయన జయంతిని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఆయన రచించిన తొలి రచన 1911లో ఆంధ్రుల కోక మనవి అనే పేరుతో వెలువడిందన్నారు. కొండేగాడు, సమదర్శిని, జనవాణి, కాగడా తదితర పత్రికలు ఆయన ప్రతిభకు నిదర్శనాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

**చింతలపూడి :** గొప్ప సాహితీవేత్త, సమాజ శ్రేయోభిలాషి తాపీ ధర్మారావు అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తాపీ ధర్మారావు జయంతి వేడుక నిర్వహించారు. ధర్మారావు చిత్రపటానికి ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్రకుమార్, తెలుగు శాఖాధిపతి డాక్టర్ జి.శ్రీనివాస్, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ బి.సరస్వతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - భీమడోలు

మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ సేవలు వినియోగించుకోవాలని ఏలూరు గుడ్ సమారిటన్ కేన్సర్ హాస్పిటల్ వైద్యులు రాజేంద్ర కోరారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేదికగా శుక్రవారం పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యులు జాహ్నవి రెడ్డి, డాక్టర్ శరణ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రాజేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఊబకాయ నివారణకు పది శాతం చక్కెర, నూనె వాడకాన్ని తగ్గించాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు వైద్య పరీక్షలు చేశారు.

**చింతలపూడి :** స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాఘవపురం పిహెచ్‌సి డాక్టర్ కిరణ్‌చైతన్య తెలిపారు. మండలంలోని శివాపురం పంచాయతీలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నరుకుళ్ల హరిణి, ఎంపిటిసి సభ్యులు చీకటి కపూర్, పంచాయతీ కార్యదర్శి కె.రాజా పాల్గొన్నారు.

**టి.నరసాపురం :** మహిళలు ప్రత్యేక వైద్య శిబిరాలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారిణి జె.కల్పనారాణి తెలిపారు. మండలంలోని కేతవరం సబ్ హెల్త్ సెంటర్ పరిధిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కల్పనారాణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేతవరం ఉప సర్పంచి భీమవరపు జగన్మోహనరావు, రాజుపోతేపల్లి ఎంపిటిసి సభ్యులు బొడ్డపాటి రాంబాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ కె రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**భీమడోలు :** ట్రాన్స్ కో భీమడోలు సెక్షన్ పరిధిలోని 33/11 కెవి సామర్థ్యపు పూళ్ళ, అంబరుపేట సబ్ స్టేషన్లకు చెందిన వివిధ 11 కెవి ఫీడర్ల వద్ద ఈ నెల 20వ తేదీన మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ తెలిపారు. దీనిలో భాగంగా పూళ్ళ, అంబరుపేట, కండ్రిక, అన్నేవారిగూడెం, వడ్లపట్ల 11 కెవి ఫీడర్ల వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న పెరిగిన చెట్ల కొమ్మలు తొలగిస్తున్నట్లు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని అన్నేవారిగూడెం, వడ్లపట్ల, అంబరుపేట గ్రామాలకు ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.